సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 14 । ఆగస్టు । 2025



దేవుడితో 'కూటమి' ఆటలు

దేవుడితోను..దేవస్థానాలతోను కూటమి ప్రభుత్వం ఆటలు ఆడుతోంది. చోటా మోటా కార్యకర్తలు, నాయకుల మాటలకు దేవదాయ శాఖ తల ఊపుతోంది.

- 8లో



రెండు తులాల బంగారం కోసం చిన్నాన్నని చంపేశాడు..

- 8లో

కేవలం రెండు తులాల బంగారం కోసం వరసకు చిన్నాన్న అయిన అప్పారావును నాటు తుపాకీతో కాల్చి చంపేశాడు.

20న స్థాయీ సంఘ సమావేశాలు

విజయనగరం: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో 1-7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

గోముఖి నదిలోకి నీరు విడుదల



గోముఖి రెగ్యులేటర్ నుంచి నదిలోకి విడిచిపెట్టిన నీరు

మక్కువ: మండలంలోని శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు గోముఖి రెగ్యులేటర్ ద్వారా బుధవారం గోముఖీ నదిలోకి 300 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీఆర్ఎస్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో ముందస్తు చర్యల్లో భాగంగా గోముఖి నదిలోకి నీటిని విడిచిపెట్టినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కవిరిపల్లి, సరాయివలస, బంగారువలస తదితర గ్రామాల ప్రజలు నదిలో రాకపోకలు సాగించరాదన్నారు.

వరలక్ష్మీవ్రతం కానుకగా రూ.25 లక్షలట..!

- ఆశ్చర్యపోతున్న మన్యం ప్రజలు

సాలూరు రూరల్: ఇటీవల రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి ఈఎన్సీ సబ్బవరపు శ్రీనివాస్ పట్టుబడిన విషయం తెలిసిందే. గిరిజన ప్రాంత రోడ్ల టెండర్లు కట్టబెట్టేందుకు కృష్ణంరాజు అనే కాంట్రాక్టర్‌ను రూ.5 కోట్లు లంచం డిమాండ్ చేశారు. ఆయన తొలివిడతగా రూ.25 లక్షలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్న విషయం విదితమే. అయితే, ఆ లంచం డబ్బులు ఓ మంత్రికి వరలక్ష్మీవ్రతం కానుకగా ఇవ్వాలనుకున్నారన్న విషయం ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆయన పట్టుబడి ఉండకపోతే మంత్రికి పెద్దఎత్తున నగదు అందేదన్న వార్తలు మన్యం ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. నిత్యం ఎదుటివారిని విమర్శించడం, దూషించడం, తనే నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని చెప్పుకునే మంత్రి... రోడ్ల కాంట్రాక్టులు కట్టబెట్టడంలో నోట్ల కట్టలు వెనుకేసుకునే తీరు ఇప్పుడు అందరినీ విస్మయపరుస్తోంది. వరలక్ష్మీ వ్రత కానుక అంటే మహిళామంత్రులే అయి ఉంటారని, ఆ మంత్రి ఎవరనేది తొందరలోనే తెలిసిపోతుందన్న చర్చ సాగుతోంది.

ప్రతీ పనికి ఒక రేటు

- రెవెన్యూ సిబ్బంది తీరుపై జేసీకి రైతు సంఘం ఫిర్యాదు



జేసీ సేతుమాధవన్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘం నాయకులు

విజయనగరంఫోర్ట్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు రెవెన్యూ సిబ్బంది ప్రతీ పనికి ఓ రేటు నిర్ణయించారు. భూముల రీసర్వే, మ్యుటేషన్ కోసం సెంటుకు రూ.500 నుంచి రూ.1000 డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే పనిచేయడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ జేసీ సేతుమాధవన్‌కు రైతు సంఘం కార్యదర్శి బుద్దరాజు రాంబాబు బుధవారం ఫిర్యాదు చేశారు. రాజకీయ బ్రోకర్ల ద్వారా డబ్బులు ఇచ్చిన వారికే పనిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎరువుల అధిక ధరలను కట్టడి చేయాలని, ఈక్రాప్ బుకింగ్ లోపాలను సరిచేయాలని విన్నవించారు. జేసీని కలిసిన వారిలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాములు, పైడిపినాయుడు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు..



అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విజయనగరం: శాప్ చైర్మన్ రవినాయుడు జిల్లా పర్యటన వచ్చారు... వెళ్లారు అన్న చందంగా సాగింది. ముందస్తుగా ప్రకటించిన నిర్ణీత సమయం కన్నా ఆలస్యంగా వచ్చిన చైర్మన్ కోసం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతో పాటు, వివిధ అసోసియేషన్ ప్రతినిధులు వేచి చూడాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంలోని పలు క్రీడా మైదానాలను స్థానిక ఎమ్మెల్యే అదితిగజపతితో కలిసి బుధవారం పరిశీలించారు. జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేస్తామని, దశలు వారీగా క్రీడా మైదానాలను ఆధునీకరిస్తామని, స్పోర్ట్స్ స్కూల్ బిల్డింగ్‌ను త్వరలోనే పూర్తిచేసి స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభిస్తామని, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేంద్రం నిధులతో విజ్జీ స్టేడియంలో 400 మీటర్లు సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను, హాకీ కోర్టును ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీటిని ఎప్పటిలోగా పూర్తిచేస్తామన్నది చెప్పకపోవడంపై క్రీడాకారులు పెదవి విరుస్తున్నారు.

యాప్‌సోపాలు!

- మాకొద్దీ ఫోన్లు
- యాప్‌ల భారం, సిగ్నల్స్ పనిచేయక అంగన్‌వాడీల ఇబ్బందులు



ఫోన్లు తీసుకొచ్చి అప్పగించిన కార్యకర్తలు (ఫైల్)



ఆందోళన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

సాక్షి, పార్వతీపురం మన్యం: అసలే ఏజెన్సీ ప్రాంతం.. ఆపై ఆన్‌లైన్ సేవలు.. జిల్లా కేంద్రంతో పాటు, మండల కేంద్రాల్లోనే ఫోన్లలో సెల్ నెట్ సరిగ్గా పని చేయదు. ఇంక మారుమూల పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో రోజుల తరబడి సిగ్నల్సే అందవు. ఈ క్రమంలో ఆన్‌లైన్ సేవలకు అంగన్‌వాడీల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడో పాత ఫోన్లు కావడం వల్ల 4 జీ, 5 జీ నెట్‌వర్క్‌కు అవి కనెక్ట్ కావడం లేదు. దీంతో వివిధ యాప్‌లలో లబ్ధిదారులు, సరకుల వివరాల నమోదుకు కార్యకర్తలు ఆపసోపాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడికక్కడ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసనలు తెలపడమే కాక.. ఆ ఫోన్లను తిరిగి వెనక్కి ఇచ్చేస్తున్నారు. యాప్‌ల భారమైనా తగ్గించాలని, లేకుంటే ఆ స్థానంలో కొత్త 5జీ ఫోన్లు అయినా ఇవ్వాలని కోరుతున్నారు. మూరుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్‌లేని చోట లబ్ధిదారులకు సంతకాలతో సరకులు పంపిణీ చేసేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సేవల్లో పారదర్శకత కోసమనీ..

జిల్లాలోని పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 2,064 ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు, బాలింతలు 8,800 మంది.. చిన్నారులు 59 వేల మంది లబ్ధి పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవల్లో పారదర్శకత పెంచేందుకు ఆన్‌లైన్ నమోదును తీసుకొచ్చారు. రూ.కోట్లు వెచ్చించి స్మార్ట్ ఫోన్లను కేంద్రాల కార్యకర్తలకు అందజేశారు. చాలా ఏళ్ల క్రితం అందించినవి కావడంతో ప్రస్తుత 5జీ వేగాన్ని అందుకోలేకపోతున్నాయి. దీనికితోడు స్టోరేజీ తక్కువ కావడం.. యాప్‌లతో చేయాల్సిన పనులు ఎప్పటికప్పుడు పెరుగుతుండటంతో ఫోన్లు సక్రమంగా పని చేయడం లేదు. లబ్ధిదారులకు క్రమం తప్పకుండా సక్రమంగా పౌష్టికాహారం అందించాలి. హాజరు నమోదు యాప్‌లో నమోదు చేయాలి. పోషణ్ ట్రాకర్, కిశోరి వికాసం, బాలసంజీవని, మిషన్ వాత్సల్య, ప్రధాన మంత్రి మాతృవందనయోజన.. ఇలా అనేక బాధ్యతలను కార్యకర్తలకు అప్పగిస్తున్నారు. ఇదంతా ఆన్‌లైన్‌లోనే జరగాలి. లబ్ధిదారుల ముఖ గుర్తింపుతోపాటు, వేలిముద్రలు కూడా సేకరించాలి, ఇన్ని పనులు చేసేందుకు ఫోన్లు సహకరించడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

సిగ్నల్స్ రావడం గగనమే..

వాస్తవానికి సరకులు పక్కదారి పక్కకుండా ఉండేందుకు వివిధ రకాల యాప్‌లను తీసుకొచ్చారు. పోషణ్ ట్రాకర్, బాలసంజీవని యాప్‌లలో ముఖహాజరును తీసుకుంటున్నారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, ఈకేవైసీ వంటివి చేయడానికి.. హాజరుకు, ఆన్‌లైన్‌లో నమోదుకు సాంకేతిక సమస్యలు అవరోధంగా మారుతున్నాయి. మైదాన ప్రాంతాల్లో వేగంగా అవుతున్నా.. కొండలపైన, మారుమూల పల్లెల్లో సిగ్నల్స్ సరిగ్గా రాక ఆన్‌లైన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఫోన్లు పని చేయక, ఏ రోజు వివరాలు ఆ రోజు నమోదు చేయలేక, ఉన్నతాధికారుల ఒత్తిడి భరించలేక కార్యకర్తలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే పని చేయని ఫోన్లు తమకు వద్దంటూ జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు వాటిని తిరిగి వెనక్కి ఇచ్చేస్తున్నారు.

ఆది కర్మయోగితో గిరిజన ప్రాంతాల్లో మార్పు

- 'స్వచ్ఛంద' భాగస్వామ్యంతో గ్రామాల్లో పనులు
- మీడియా సమావేశంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ఆది కర్మయోగి కార్యక్రమం గిరిజన ప్రాంతంలో మార్పు తెచ్చేందుకు దోహదపడుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆది కర్మయోగి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. మొదటి దశలో ఆరు మండలాలకు సంబంధించిన శిక్షకులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. సామాజిక భాగస్వామ్యం, అవగాహనతో గిరిజన గ్రామాల్లో అవసరాలను గుర్తించి, సామాజిక బాధ్యతతో వాటిని చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గ్రామ సభల నిర్వహణ, గ్రామస్తులతో సహా బృందాలు పర్యటించి అక్కడ అవసరాలను గుర్తించడం ద్వారా వాటిని పరిష్కరించే మార్గాన్ని అన్వేషించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఆన్‌లైన్ టూల్‌ను రూపొందించారని.. గ్రామాల్లో గుర్తించిన అంశాలను అందులో పొందుపరచనున్నారని తెలిపారు. ఆది కర్మయోగిలుగా పలువురు స్వచ్ఛంద కార్యకర్తల భాగస్వామ్యంతో గ్రామాల్లో పనులు చేపడతారని వివరించారు. చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరూ పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మనది అనే సొంత భావన ఏర్పడుతుందన్నారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ పీఎం జన్‌మాన్ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్నీ నిశితంగా అంచనా వేసి, దానిని వాస్తవంగా పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన కర్మయోగిలకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో జిల్లాకు భారీ వర్ష సూచన

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఈ నెల 17, 18 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నదీతీర గ్రామాలు, ముంపు ప్రాంతాల్లో దండోరావేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పంట నష్టం జరగకుండా, పంట కాలువలు, గట్లు తెగిపోకుండా ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్యారోగ్యం పట్ల ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, డీఆర్వో కె.హేమలత, విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్లికార్జున, డీఈఓ బి. రాజకుమార్, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, డీపీఓ టి.కొండలరావు, సీపీఓ ఎస్.ఎస్.ఆర్.కె. పట్నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారం పేరుతో బురిడీ

- నగం ధరకే బంగారం ఇప్పిస్తామంటూ రూ.12 లక్షలతో ఉడాయించిన కేటుగాళ్లు
- లబోదిబోమంటున్న బాధితురాలు



ఘటనా స్థలాన్ని చూపిస్తున్న బాధిత మహిళ శ్రీలక్ష్మి

పార్వతీపురం రూరల్: సగం ధరకే పావుకిలో బంగారం ఇప్పిస్తామంటూ నమ్మించి ఓ మహిళ వద్ద రూ.12లక్షలతో దుండగలు పరారైన ఘటన పార్వతీపురం పట్టణ శివారులో చోటుచేసుకుంది. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ప్రాంతానికి చెందిన శ్రీలక్ష్మిను తన వద్ద గతంలో విద్యనభ్యసించిన విద్యార్థిని భర్త రిషి అనే వ్యక్తి గతనెల జూలైలో కలిశారు. సగం ధరకే బంగారం ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. పావుకిలో బంగారాన్ని రూ.12 లక్షలకు ఇప్పిస్తామని, డబ్బులు సిద్ధం చేసుకోవాలని చెప్పాడు. ఆ మేరకు ఆమె ఈ నెల 11న డబ్బులు సిద్ధంచేశారు. ఆయన సూచన మేరకు బంగారం విక్రయించే వారి వద్దకు వెళ్లేందుకు బుధవారం పాలకొండకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. బంగారం విక్రయిస్తామని చెప్పిన ఇద్దరు వ్యక్తులతో మాట్లాడారు. బంగారాన్ని బహిరంగంగా చూపించడం కుదరదంటూ పార్వతీపురం శివారులో ఉన్న వాటర్‌పంప్ హౌస్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మాట్లాడుతున్న సమయంలో మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీలక్ష్మి ముఖంపై మత్తు పౌడర్ చల్లారు. ఆమె అపస్మారక స్థితిలోకి చేరాక రూ.12 లక్షలతో ఉడాయించారు. తనతో పాటు వచ్చిన రిషి అనే వ్యక్తి కూడా కనిపించకపోవడంతో పార్వతీపురం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిషి అనే వ్యక్తిని విచారణ చేసి కేసు నమోదు చేశామని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్డ్ కులాలు, బీసీ మైనారిటీ పిల్లలు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి 25 శాతం కోటా కింద ప్రవేశాలు కల్పిస్తామన్నారు.



సువర్ణముఖీనది బ్రిడ్జ్‌పై నిలిచిన వర్షపునీరు

గుంతల రోడ్డుపై ప్రయాణ చింత

మక్కువ మండలం సువర్ణముఖీనది బ్రిడ్జి రోడ్డు పూర్తిగా పాడైంది. పెద్దపెద్ద గోతులు కావడంతో వర్షపునీరు నిలిచిపోతోంది. బ్రిడ్జిశ్లాబు మరమ్మతులకు గురికావడం, రోడ్డు పాడవ్వడంతో ఈ ప్రాంతీయులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుపై ఉన్న గోతులు తప్పించే ప్రయత్నంలో పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారు. పల్లెపండగ పేరుతో రోడ్లు బాగుచేస్తున్నామంటూ హడావిడి చేసిన కూటమి నేతలకు గోతుల రోడ్డు కనిపించకపోవడంపై ఈ ప్రాంతీయు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మక్కువ

డిగ్రీ ప్రవేశాలపై కూటమి కినుక!

- నేటికీ డిగ్రీ ప్రవేశాలకు విడుదలకాని నోటిఫికేషన్
- నాలుగునెలల కిందట ఇంటర్ ఫలితాలు విడుదల
- ఎదురుచూస్తున్న వేలాది మంది విద్యార్థులు
- సమయం వృథాపై ఆందోళన



ఇంటర్మీడియట్ ఉత్తీర్ణలైన బాలికలు

పాలకొండ రూరల్: విద్యార్థి జీవితంలో కాలం కీలకమైనది. ఒక విద్యా సంవత్సరం కోల్పోతే పూడ్చడం కష్టం. తరగతులు ఆలస్యమైతే ఆ ప్రభావం ఫలితాలపై పడుతుంది. ఒత్తిడి పెరుగుతుంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి డిగ్రీలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విద్యార్థులది ఇదే పరిస్థితి. ఇంటర్ ఫలితాలు విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. విద్యార్థులను ఆవేదనకు గురిచేస్తోంది. అసలు డిగ్రీ వేశాలు ఉంటాయా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తు సీఎం తనయుడు బాధ్యత వహించే శాఖలోనే ఈ వింత పరిస్థితి నెలకొనడం గమనార్హం. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువు, వారి భవిష్యత్తుపై మంత్రికి లేకపోవడంపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇంకెప్పుడు డిగ్రీ ప్రవేశాలు కల్పిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

ఎదురుచూపు...

పాలకొండ డివిజన్ కేంద్రం పాలకొండలో ఒక ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో గల సీతంపేటలో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వీరఘట్టం మండల కేంద్రంలో ఓ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ఒక్కో కళాశాలలో దాదాపుగా 300 సీట్లు ఉండగా మొత్తం ఏడు కళాశాల్లో 2,100 మంది పైచిలుకు విద్యార్థులు ప్రవేశాలకు వేచిచూస్తున్నట్లు ఓ అంచనా.



పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

తేలని పంచాయితీ...

గతంలో మూడేళ్ల కాలపరిమితి గల డిగ్రీ చదువులు ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల కాలపరిమితికి నిర్దేశించబడ్డాయి. ఈ క్రమంలో చోటు చేసుకుంటున్న తర్జనభర్జనలు ఓ కొలిక్కి వచ్చినట్లు లేదు. వ్యక్తిగత ఆర్థిక తోడ్పాటు ఉన్న విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. మధ్య, పేద కుటుంబాల విద్యార్థులు డిగ్రీ చదువులపై ఆశలు పెట్టుకున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు తమ కళాశాల్లో చేరాలని, నచ్చిన కోర్సుల్లో అడ్మిట్ అయితే అటుపై ప్రభుత్వం నుంచి ఆన్‌లైన్ లేదా ఆఫ్ లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభ మైన తరువాత దరఖాస్తులు చేయించి, తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునేలా పిల్లలను ప్రోత్సహిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో డిగ్రీ ప్రవేశాలు సకాలంలో జరిగేవని, ఎటువంటి అవస్థలు లేకుండా విద్యార్థులు వారికి నచ్చిన కోర్సుల్లో స్వేచ్ఛగా చేరేవారని, ఇప్పుడు తిప్పలు తప్పడంలేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

నాలుగు నెలులగా ఎదురుచూపు



ఇంటర్‌లో మంచి మార్కులు సాధించాను. డిగ్రీలో చేరాలని నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నాను. ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదలకాలేదు. నావలే మా కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన వందల మంది విద్యార్థులు ఉన్నారు. కొంత మంది ప్రైవేటు కళాశాలల్లో ముందుగా చేరుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ పూర్తి చేసి, ప్రవేశాలు కల్పించాలి. మా తల్లితండ్రులు అధిక మొత్తం ఖర్చుచేసి ఇంజినీరింగ్‌లో చేర్పించలేరు. మాకు డిగ్రీనే ఆధారం.

– ఎస్.దమయంతి, పాలకొండ

ఎటువంటి ఆదేశాలు లేవు



ఉన్నత విద్యా మండలి నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. బహుశా ఈ నెల 18న అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. సింగ్ మేజర్ విధానంలో అడ్మిషన్లు చేపట్టనున్నారు. నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అడ్మిషన్లు త్వరితగతిన పూర్తిచేస్తాం.

– డాక్టర్ ఎం.శ్యాంబాబు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలకొండ

పైడితల్లి జాతర తేదీలు ఖరారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి జాతర తేదీలు ఖరారైనట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష బుధవారం తెలిపారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఉత్సవ నిర్వహణ తీరును వివరించారు. సెప్టెంబర్ 12న ఉదయం 8 గంటల నుంచి మండల దీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేరోజు చదురుగుడి వద్ద ఉదయం 9.30 గంటలకు, వనంగుడి వద్ద 11 గంటలకు పందిరిరాట వేస్తామన్నారు. అక్టోబర్ 6న తొలేళ్ల ఉత్సవం, 7న సిరిమానోత్సవం, 14న పెద్దచెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 22న చండీహోమం, పూర్ణాహుతితో ఉత్సవం ముగుస్తుందన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో.. 130 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, ఎన్టీఆర్ట్రస్ట్ సౌజన్యంతో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది 130 మంది 130 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు స్వయంగా రక్తదానంచేసి విద్యార్థులకు ప్రేరణగా నిలిచారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, డాక్టర్లు సోమశేఖర్, సునీత, యోగానంద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు గంగుబూడి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ తదితరులు

లక్కవరపుకోట : మండలంలోని గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల లక్కవరపుకోట మండల కేంద్రం ఏపీ మోడల్ స్కూల్ మైదానంలో జరిగిన ఎంపికలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ గాడి రవి కుమార్ బుధవారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో గొర్లె పూర్ణచందు, జూనియర్స్ విభాగంలో వానపల్లి మనోజ్ ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరు ఈ నెల 29 నుంచి 31వ తేది వరకు ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు నుంచి ఆడుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు శారదాదేవి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వి.వి.జి.మంగరాజు తదితరులు అభినందించారు.

మారెడుబాకలో ఇరు వర్గాల కొట్లాట



ఎస్‌ఐకు దాడి ఘటనపై వివరిస్తున్న బాధితురాలు

రాజాం సిటీ: మండల పరిధి మారెడుబాక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఇరువర్గాల కొట్లాటలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జరజాన కోటేశ్వరరావు, వర్రి రామకృష్ణల మధ్య చెలరేగిన స్థల వివాదం కొట్లాటకు దారితీసింది. వర్రి రామకృష్ణతో పాటు మరో తొమ్మిది మంది జరిపిన దాడిలో జరజాన కోటేశ్వరరావుతో పాటు సునీత, లత, కుంచి నిర్మల, రాయ లక్ష్మి గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు వీరిని రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడు అరెస్టు

తెర్లాం: ఓ యువతిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన కేసుకు సంబంధించి యువకుడిని అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన సిరిపురపు వెంకటరమణ, అదే గ్రామానికి చెందిన యువతి గత కొన్నేళ్లుగా ప్రేమించుకున్నారు. ఆ యువకుడు తనను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి పెళ్లి చేసుకోమని కోరినప్పుడు పెళ్లి చేసుకొనేందుకు నిరాకరించాడని, వేరొక యువతిని పెళ్లి చేసుకున్నానని చెప్పడంతో ప్రేమించిన యువతి తాను మోసపోయానని, తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకునిపై నమ్మించి మోసం చేసినట్టుగా తెర్లాం ఎస్‌ఐ బి.సాగర్ బాబు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు నిర్వహించిన బొబ్బిలి రూరల్ సీఐ యువతిని ప్రేమించి, మోసగించిన యువకుడిని అరెస్టు చేసి బొబ్బిలి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

సెప్టెంబర్ 14న పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలు

పార్వతీపురం రూరల్: ఉత్తరాంధ్ర స్థాయిలో పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నట్టు శ్రీ వాణి ఆర్ట్స్ వ్యవస్థాపకులు డాక్టర్ పీజే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం పట్టణంలో గల లయన్స్ కల్యాణ మండపం వేదికగా సెప్టెంబర్ 14వ తేదీన ఆదివారం ఉదయం 8 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పోటీలలో పాల్గొనేందుకు ఆగస్టు 25లోగా ప్రవేశ రుసుము రూ.200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు ప్రత్యేక స్థానాలుగా గుర్తించి ప్రతిభ కనబరిచిన కళాకారులకు జ్ఞాపకతో పాటు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునేందుకు 8186076044, 9849833439, 9948128766 నంబర్లను సంప్రదించాలని కోరారు. శ్రీ వాణి ఆర్ట్స్ 12వ వార్షికోత్సవ సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

దేవుడితో కూటమి ఆటలు

- ట్రస్టుబోర్డు నియామకంలో కుంపట్లు
- వంశపారంపర్య, వ్యవస్థాపక ధర్మకర్తలకు మొండిచేయి
- నిన్న నవదుర్గామాత ఆలయం..
- నేడు పోలిపల్లిపైడితల్లి ఆలయం



నవదుర్గామాత ఆలయం

రాజాం: దేవుడితోను..దేవస్థానాలతోను కూటమి ప్రభుత్వం ఆటలు ఆడుతోంది. చోటా మోటా కార్యకర్తలు, నాయకుల మాటలకు దేవదాయశాఖ తల ఊపుతోంది. నిబంధనలు ఉల్లంఘించి రాజకీయాలు చేస్తోంది. దేవాలయాల ట్రస్టు బోర్డు నియామకంలో సిఫార్సులకు అనుగుణంగా వ్యవహరిస్తోంది. రాజకీయాలు చేసి, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తోంది. హైందవ ధర్మాన్ని అటకెక్కించే పనిలో పడింది. రాజాంలో నిన్న నవదుర్గామాత ఆలయ ట్రస్టుబోర్డు కమిటీ నియామకంలో నిబంధనలు ఉల్లంఘించిన దేవదాయశాఖ, ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన పోలిపల్లి పైడితల్లి ఆలయం ట్రస్టు బోర్డు నియామకంలో కూడా వివాదాలకు తావిచ్చింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా..

ఆలయ ట్రస్టు బోర్డులు, అభివృద్ధి కమిటీల ఏర్పాటులో గత ప్రభుత్వాలు రాజకీయ జోక్యం చేసుకోలేదు. ఇప్పుడు అలా కాకుండా కూటమి కుంపటి పెడుతోంది. రాజాం బస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయ ట్రస్టు బోర్డు ఎంపిక పక్షం రోజుల క్రితం జరిగింది. ఆ బోర్డులో ఆలయ వ్యవస్థాపక కుటుంబానికి చెందిన ధర్మకర్తను చైర్మన్‌గా ఉంచాల్సి ఉండగా, ఆయనను తొలగించి, రాజాం పట్టణ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త పేరును ప్రకటించింది. దీంతో ఇక్కడ పెద్దస్థాయిలో వివాదం చెలరేగడంతో పాటు వ్యవస్థాపక ధర్మకర్తలు ఈ నియామకాన్ని తిరస్కరించడంతో ప్రస్తుతం ఈ బోర్డు ఎంపిక వివాదాస్పదంగా మారి గాలిలో ఉంది. గతంలో ఈ బోర్డు ఎంపికలో ఇటువంటి ఇబ్బందులు రాలేదని, వ్యవస్థాపక ధర్మకర్త వానపల్లి తమ్మయ్య గురువు కుమారుడు వానపల్లి నర్సింగరావు తెలిపారు. ధర్మకర్త కుటుంబానికి చెందిన చైర్మన్‌గా ఉంటారని, మిగిలిన సభ్యులను దేవదాయశాఖ నియమించాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ విధానంలోనే చైర్మన్‌గా ధర్మకర్తను కొనసాగించి, ఆలయ అభివృద్ధికి సహకరించిన మిగిలిన భక్తులకు కమిటీలో చోటు కల్పించేవారని వెల్లడించారు.



పోలిపల్లి పైడితల్లి ఆలయం

ఈ దఫా ఈ నిబంధనలు అటకెక్కించి, ఆలయానికి రానివారిని, ఆలయం అంటే తెలియని వారిని సభ్యులుగా పెట్టిన పరిస్థితి ఉందన్నారు.

తాజాగా మరో వివాదం

ఇదిలా ఉండగా ఇప్పుడు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు ఎంపికకు దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో ట్రస్టు చైర్మన్ పదవిని ఖాళీ ఉంచి, మిగిలిన కమిటీకి నోటిఫికేషన్ ఇవ్వాలి. అలాకాకుండా మొత్తం కమిటీకి దరఖాస్తులు ఆహ్వానించడంతో వివాదం ప్రారంభమైంది. కొన్నేళ్లుగా ఇక్కడ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఆలయ ధర్మకర్త కుటుంబానికి చెందిన వాకచర్ల కుటుంబీకులే వ్యవహరిస్తున్నారు. గతేడాది వరకూ ధర్మకర్త కుమారుడైన వాకచర్ల దుర్గాప్రసాద్ చైర్మన్‌గా వ్యవహరించారు. పైడితల్లి అమ్మవారి ఆలయానికి సంబంధించి అన్ని ఉత్సవాల్లో వారి భాగస్వామ్యం ఉంటుంది. అటువంటి ధర్మకర్త కుటుంబాన్ని పక్కన పెట్టి, కొత్తవారికోసం నోటిఫికేషన్ ఇవ్వడంతో ఇక్కడ వివాదం ప్రారంభమై, దేవదాయశాఖ తీరుతో పాటు కూటమి ప్రభుత్వ తీరుపై భక్తులు విమర్శలు చేస్తున్నారు. ఇంతటి దురదృష్టకర పాలనను ఇంతకు ముందు చూడలేదని బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ కమిటీ ఎన్నిక ఎలా జరుగుతుందో చూస్తామని హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు మారాయి



పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ ఎంపిక నోటిఫికేషన్ ఉన్నతాధికారుల నుంచి వచ్చింది. గతంలో వంశపారంపర్య ధర్మకర్తలే చైర్మన్‌లుగా ఉండేవారు. ఇప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇక్కడ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకే నియామకం ఉంటుంది. నా చేతిలో ఏమీలేదు.

బీవీ మాధవరావు, దేవాదాయశాఖ రాజాం మేనేజర్

ఆటల్లో సత్తా చాటిన పాఠశాలలకు పురస్కారాలు

- ఈ నెల 18 లోగా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం
- జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలకు దక్కనున్న అవార్డులు
- స్కూల్ గేమ్స్ క్రీడలో ప్రతిభ చూపిన వారికి అవకాశం



ఆటలాడుతున్న క్రీడాకారులు

విజయనగరం: ఆటల్లో మేటిగా నిలిచే క్రీడాకారులున్న పాఠశాలలకు పురస్కారాల పంట పండనుంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఐదు ఉత్తమ పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాలు అందజేయాలని, ఆ మేరకు దరఖాస్తులు ఆహ్వానించాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. 19న దరఖాస్తుల పరిశీలన, 20న అభ్యంతరాల స్వీకరణ, 21న తుది జాబితా ప్రకటిస్తారు.

విద్యార్థులకు ప్రోత్సాహం..

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పాఠశాలలకు ఏటా పురస్కారాలు అందజేస్తున్నారు. ఈ ఏడాది హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఆ రోజు అన్ని పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

క్రీడా ఫలితాల ఆధారంగా..

ఉత్తమ పాఠశాలల ఎంపికకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని నియమించనున్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో ఐదు మంది సభ్యులుగా ఉంటారు. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి అత్యధిక విజయాలు సాధించిన పాఠశాలల్లో ఐదింటిని కమిటీ గుర్తిస్తుంది. ఇందుకు ప్రతి క్రీడలో అత్యధిక స్కోరును పరిగణనలోకి తీసుకుంటారు. 2024 - 2025కు సంబంధించిన క్రీడా ఫలితాల ఆధారంగా జిల్లాలో ఐదు ఉత్తమ పాఠశాలలకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రదర్శనలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని బడుల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవచ్చు. వీటితో ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ సంతకంతో క్రీడాకారులు సాధించిన ధ్రువపత్రాల నకళ్లతో ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన పాఠశాలలకు 29న జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేస్తారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు.

గంజాయితో సంపాదించిన ఆస్తులు ఫ్రీజ్ : ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్ : ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన గంజాయి వ్యాపారి నగేష్ అలియాస్ బాలరాజుకు చెందిన రూ.56 లక్షల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేశామని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. జిల్లాలోని ఎస్.కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టు అయిన నగేష్ ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పంత్లున్గా పంచాయత్ నందాపూర్ మండలం భాకాపుట్ గ్రామానికి చెందిన వాడని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాతో సంపాదించిన సుమారు రూ.56 లక్షల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేశామని పేర్కొన్నారు. గంజాయి వ్యాపారుల నుంచి అతని భార్య జమున బ్యాంకు ఖాతాకు పలుమార్లు రూ.6.53 లక్షల నగదు జమ అయినట్టు తమ విచారణలో తేలిందని తెలిపారు. నిందితుడు సంపాదించిన అక్రమ ఆస్తులను ఎవరికీ విక్రయించకుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్టు నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. ఫ్రీజ్ చేసిన ఆస్తులు కొల్‌కత్తాలోని కాంపిటెంట్ అథారిటీ పరిధిలోకి వెళ్లాయని, సదరు ఆస్తులను ఎవరు కొనుగోలు చేసినా చెల్లనేరవని ప్రజలు దీన్ని గుర్తించాలని ఎస్పీ కోరారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పని చేసిన అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్.కోట ఇన్‌స్పెక్టర్ వి.నారాయణమూర్తి ఇతర పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

జర్మన్ భాషపై ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురం టౌన్: జర్మనీ దేశంలో అసిస్టెంట్ నర్సు ఉద్యోగాలు పొందేందుకు జిల్లాలోని జి.ఎన్.ఎమ్ చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంకాప్, టి.ఎస్.ఎ.ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని వివరించారు. తప్పనిసరిగా జి.ఎన్.ఎమ్ పూర్తి చేసి ఏడాది పాటు సాధారణ ఆసుపత్రుల్లో అనుభవం కలిగి 39 ఏళ్లలోపు వయసున్న వారు జర్మన్ భాష నేర్చుకోవడానికి అర్హులని తెలిపారు. శిక్షణ రోజుకు 2 నుంచి 3 గంటల పాటు సుమారు 8 నెలల వరకు ఉంటుందని అన్నారు. ఇందులో ఏ1, బీ2 లాంగ్వేజ్‌లపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ.30,000లు సెక్యూరిటీ డిపాజిట్ చేసి, జర్మనీ వెళ్లేందుకు విమాన చార్జీలు, బీ2 పరీక్ష ఫీజు, వీసా చార్జెస్ చెల్లించాలన్నారు. శిక్షణ పూర్తి చేసి బీ2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి నెలకు రూ.2 లక్షల నుంచి 2,50,000ల వరకు జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7032060773 నంబరును సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

19న ఐద్వా మహాసభలు



ఐద్వా మహాసభలపై ప్రచారం చేస్తున్న మహిళలు

విజయనగరం గంటస్తంభం: విజయనగరంలో ఈ నెల 19న జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.రమణమ్మ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రామకృష్ణ నగర్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో విలేకర్లతో ఆమె మాట్లాడారు. మహిళా హక్కులు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్, అధిక ధరలకు వ్యతిరేకంగా, ప్రజాసమస్యల పరిష్కారం కోసం మహిళలపై జరిగే దాడులు, హత్యలు, ఆత్యాధారాలు, లైంగిక, వరకట్న వేధింపులు, స్త్రీ వివక్ష, డ్వాక్రా మహిళల సమస్యలు, మైక్రోఫైనాన్స్, మద్యం, గంజాయి, డ్రగ్స్, అశ్లీలత మొదలైన సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు, పోరాటాలు ఐద్వా నిర్వహిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జాప్యం చేయడం సరైంది కాదని వెంటనే ప్రతి మహిళకు రూ.1500 పథకం అమలు చేయాలన్నారు. అన్ని సర్వీసుల్లో రాష్ట్రం మొత్తం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకులు ఎం.జగదాంబ, కె.రమణమ్మ పాల్గొన్నారు.

రెండు తులాల బంగారం కోసం చిన్నాన్నని చంపేశాడు..

- నాటు తుపాకీతో హత్య చేసిన వ్యక్తి అరెస్టు
- వివరాలు వెల్లడించిన విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు



నిందితుడు సిమ్మ అప్పారావుని విలేకరుల ముందు హాజరుపరచి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కొత్తవలస : కేవలం రెండు తులాల బంగారం కోసం జరిగిన వివాదం వరసకు చిన్నాన్న అయిన సిమ్మ అప్పారావును నాటు తుపాకీతో కాల్చి చంపడానికి దారి తీసిందని విజయగనరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు(70)ను తన మేనకోడలు భర్త అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలస గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు(36) ఈ నెల 5వ తేదీన అతి సమీపం నుంచి నాటు తుపాకీతో కాల్చి చంపిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు గ్రామానికి చెందిన సిమ్మ శివకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సిహెచ్.షణ్ముఖరావు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా నిందితుడు సిమ్మ అప్పారావును కోటపాడు రోడ్డు సీతంపేట గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక విలేకరుల ముందు నిందితుడిని హాజరుపరిచి వివరాలను విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. నిందితుడు అప్పారావు భార్య ఏడాదిన్నర క్రితం మృతి చెందింది. ఆమెకు సంబంధించిన బంగారం, భూమి ఇతర ఆస్తులు మేనమామ అయిన మృతుడు సిమ్మ అప్పారావు వద్ద ఉన్నట్టు తెలిపారు. సదరు బంగారం, భూమి ఇవ్వాలని నిందితుడు అప్పారావు మృతుడు అప్పారావుని పలుమార్లు అడిగాడు. అయినా బంగారం ఇవ్వకపోవడంతో ఈ నెల 5న నిందితుడు తన స్వంత ఆటోలో ముసిరాం వచ్చి మరోసారి బంగారం ఇవ్వమని అడిగాడు. ఆయన నిరాకరించడంతో తనతో పాటు తెచ్చుకున్న నాటు తుపాకీతో గుండెపై కాల్చడంతో అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడని తెలిపారు. సీతంపేట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. తుపాకీ కోసం విచారించగా పాతవలస సమీపంలో వుంచినట్లు తెలపగా తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన సీఐ సిహెచ్.షణ్ముఖరావు, ఎస్‌ఐ పి.ప్రసాద్‌రావు, పీసీలు ఎల్.రమేష్, దేముడు తదితరులను అభినందించారు. రివార్డులకు సిఫార్స్ చేస్తామని తెలిపారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంక్షేమ, ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్ : మూడవసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలో రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతుకు ద్రోహం చేస్తున్నదని పలు రైతు సంక్షేమ, రైతుకూలి, ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతు, కార్మిక నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో వ్యవసాయ రంగంలోకి 'కార్పొరేట్' సంస్థలను తీసుకువచ్చే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు పండే భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ఇవ్వడం సరికాదన్నారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఈవీ నాయుడు, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు పి.శ్రీనునాయుడు, కృష్ణ వేణి, ఎం.భాస్కరరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిన మోహన్, గేదెల రామకృష్ణ, వంగల దాలినాయుడు, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్, దుర్గారావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మరణించిన కెమిస్ట్ వలిపల్లి సుధాకర్

డెంకాడ: మండలంలోని చింతలవలస వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన వలిపల్లి సుధాకర్(37) దివీస్ కంపెనీలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. బి షిఫ్ట్ కావడంతో బుధవారం మధ్యాహ్నం ధర్మపురి నుంచి తగరపువలస సమీపంలో ఉన్న దివీస్ కంపెనీకి వెళ్తుండగా.. చింతలవలస గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దీనిలో వలిపల్లి సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన సుధాకర్‌ను చికిత్స నిమిత్తం విజయనగరం కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు.

కళాశాల విద్యార్థుల మధ్య కొట్లాట



చెవికి గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్య ఘర్షణ కొట్లాటకు దారితీసింది. ఈ నెల 18న నిర్వహించనున్న ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి సంబంధించి ఎంట్రీ పాస్‌ను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి పోగొట్టుకోవడంతో రెండో ఏడాది ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వారికి మధ్య ఘర్షణ జరగడంతో ఆ ఘర్షణ కాస్త కొట్లాటకు దారి తీసిందిసింది. కళాశాల అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఇరు వర్గాల విద్యార్థుల మధ్య ఘర్షణ అనంతరం కొట్లాటకు దారి తీయడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గాయాలైన విద్యార్థులు చేరినట్టు ఈ మేరకు ఔట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది వివరాలు సేకరించినట్టు తెలిపారు. అలాగే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యార్థుల నుంచి సేకరించి కేసు నమోదు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ గోవింద తెలిపారు.

ఎస్ఎంఎస్ పరిశ్రమ ఉద్యోగి మృతి



పరిశ్రమ గేటు ఎదురుగా మృతదేహంతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మృతుడు శ్రీనివాసరావు (ఫైల్)

- అంబులెన్స్‌లో మృతదేహంతో గేటు ఎదుట నిరసన
- పరిశ్రమ యాజమాన్యంతో ప్రజాప్రతినిధులు చర్చలు
- రూ.20లక్షలు పరిహారం ప్రకటించిన యాజమాన్యం

పూసపాటిరేగ : మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమ ఉద్యోగి విధి నిర్వహణలో వుండగా అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీనివాసరావు (26) ఎస్ఎంఎస్ పరిశ్రమలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఏ షిఫ్టుకు హాజరైన శ్రీను విధులు నిర్వహిస్తుండగా ఆకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. సొమ్మసిల్లిన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం విజయనగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పరిశ్రమ ఉద్యోగి మృతి చెందడంతో గ్రామస్తులు, మృతుని బంధువులతో మృతదేహం అంబులెన్సులో వుంచి పరిశ్రమ గేటు ఎదురుగా ఆందోళనకు దిగారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ పరిశ్రమలో ఎటువంటి ప్రమాదం జరగలేదని, అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు తెలిపారు. దీంతో పరిశ్రమ ఉద్యోగికి న్యాయం చేయాలని గ్రామస్తులు, మృతుని బంధువులు పట్టుబట్టడంతో యాజమాన్య ప్రతినిధులు రూ.20 లక్షలు పరిహారం ఇవ్వడానికి అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం ఎస్‌ఐలు ఐ.దుర్గాప్రసాదు, ఎ.సన్యాసినాయుడు, పాపారావు సిబ్బందితో పాటు గేటు వద్ద బందోబస్తు నిర్వహించారు.

అదుపు తప్పి బోల్తా పడిన పొక్లెయినర్

- ఒకరి మృతి



మృతి చెందిన ట్రాలీ డ్రైవర్ ప్రమోద్‌కుమార్

మెంటాడ: మండలంలో వాణిజి గ్రామం నుంచి అనంతగిరి మండలం బూరుగ గ్రామానికి రోడ్డు వేసే పనులు జరుగుతున్నాయి. మంగళవారం పనులు పూర్తయిన తరువాత పొక్లెయినర్‌ను ట్రాలీ పైకి ఎక్కిస్తుండగా అదుపు తప్పి లైటింగ్ చూపిస్తున్న బీహార్‌కు చెందిన ట్రాలీ డ్రైవర్ ప్రమోద్‌కుమార్, మెంటాడకు చెందిన తాడ్డి రాంబాబులపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ ప్రమోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తాడ్డి రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి ఎస్‌ఐ సీతారాం చేరుకుని గాయాల పాలైన రాంబాబును జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మృతి చెందిన ప్రమోద్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సీతారాం తెలిపారు.